క్లుప్తంగా

శివారాధనతో పుణ్య ఫలం



సత్రశాల(రెంటచింతల): శివకేశవులకు ఎంతో ప్రీతి కరమైన కార్తిక మాసంలో శివారాధన చేయడం ఎంతో పుణ్య ఫలమని గంగా భ్రమరాంబ సమేత మల్లి కార్జున స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్టేల శివశర్మ అన్నారు. కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం అనేక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దేవస్థానానికి అతి సమీపంలో ఉన్న కృష్ణానదిలో భక్తులు వేకువ జామున స్నానం చేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి, రుద్ర హోమం నిర్వహించారు. పోసాని విజయబాబు, సొంటిరెడ్డి చిన్న నర్సిరెడ్డి, కొర్రపాటి లింగయ్య దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రెంటచింతలకు చెందిన భజన బృందం కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ గాదె రామిరెడ్డి పాల్గొన్నారు.

దేవునికి, విశ్వాసులకు వారధి పాస్టర్



దాచేపల్లి : ప్రభువైన క్రీస్తుకి, విశ్వాసులకు మధ్య వారధి పాస్టర్లు అని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. మండల వ్యాప్తంగా ఆదివారం పాస్టర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. పలు చర్చిల్లో పాస్టర్లను సంఘస్తులు సన్మానించారు. కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ...క్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గాన్ని భూలోకంలోని విశ్వాసులకు, ప్రజలకు తెలియజేసేందుకు తమను ఏర్పాటు చేసుకున్నారని, క్రీస్తు రెండవ రాకడకు కోసం ఈ లోకంలో విశ్వాసులను సిద్ధపరిచే బాధ్యతను క్రీస్తు అప్పగించారన్నారు. పాస్టర్‌గా పని చేయడం అనేది ఆత్మల భారంతో కూడుకున్నదని, చెడు మార్గాల్లో పయనించే వారికి క్రీస్తు వాక్యం బోధించి సన్మార్గంలో నడిపించేలా పని చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, డేలిగేట్ శ్రీపతి కాశయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



విజయపురిసౌత్: ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం వలంటీర్లు కృష్ణవేణి పుష్కర ఘాట్ వద్ద ఆదివారం శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్శకులు ఘాట్‌కి వెళ్లే దారిలో ఉన్న ముళ్ల పొదలను, చెత్తా చెదారాన్ని శుభ్రంగా తొలగించారు. అలాగే అక్కడ వ్యాపారం చేస్తున్న వారికి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని వాలంటీర్లు సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను పలువురు సందర్శకులు, స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్కే మహమ్మద్ బాష పాల్గొన్నారు.

సాగర్‌మాత దేవాలయంలో తేరు ప్రదక్షిణ



విజయపురిసౌత్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవ రూపాన్ని ధరించి, సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధివిధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తల నీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణ లో భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాచర్ల: పట్టణంలోని షాదీ ఖానాలో ఆదివారం రోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉచితంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి, రోగాలకు మందులు అందించినట్లు తెలిపారు. రక్త పరీక్షలు, వివిధ రకాల పరీక్షలు చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఈఎన్‌టీ వైద్యులు వశింమీరా, కంటి వైద్యులు సందీప్ రోగులను పరిశీలించి తగిన సలహాలిచ్చారు. చైర్మన్ షేక్ మీరావలి, నాగూర్ బాషా ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల అనంతరం కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా బస్సులను ఏర్పాటు చేసి, వారికి ఆపరేషన్లు చేయించి తిరిగి ఇక్కడకు తీసుకొస్తామన్నారు. 38 మందికిన ఆపరేషన్లు నిమిత్తం వైద్యశాలకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ముప్పు మూటగట్టుకుంటున్నారు

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- నేలకొరుగుతున్న వందల ఏళ్ల వృక్షాలు



నిప్పు అటించడంతో నేలకు ఒరిగిన చింతచెట్టు

రెంటచింతల: మన పూర్వీకులు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు నాటిన మొక్కలే నేడు చెట్లుగా ప్రాణవాయువుతో పాటు వాతావరణ సమతుల్యతకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. అజ్ఞానంతో కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పచ్చని చెట్లకు నిప్పు అంటించడం, చెట్లను విచక్షణ రహితంగా నరకడంతో నేల కూలుతున్నాయి. ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల మధ్య అనేక చెట్లను కొందరు నరకడంతో పాదచారులకు అప్పటి వరకు నీడను ఇచ్చిన చెట్లు నేల కూలాయి. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చింత చెట్లకు కొందరు అకతాయిలు నిప్పు అంటిస్తుండటంతో వందల సంవత్సరాల వయస్సు కల్గిన చింతచెట్లు నేలకొరుగుతున్నాయి. పచ్చని చెట్లతోనే ప్రగతికి మెట్లుగా భావిస్తూ భావితరాలకు పరిశుభ్రమైన మంచి వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కూడా మొక్కలను నాటడంతోపాటు పెరిగిన చెట్లను కాపాడటం బాధ్యతగా భావించాలని పలువురు వృద్ధులు, ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు. గ్రామాలలో చెట్లను విచక్షణా రహితంగా నరకడం వల్ల వాతావరణంలో సమతూల్యత లోపించి మానవ జీవితంతో పాటు అనంతకోటి జీవరాసుల మనుగడకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది.

పచ్చదనంపై అవగాహన కల్పించాలి



ప్రజలకు పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం అవగాహన కల్పించేందుకు సదస్సులను నిర్వహించాలి. ప్రాణ వాయువును అందించే చెట్లను మనం కాపాడుకోవాలి. విద్యార్థి దశ నుంచే మొక్కలను పెంచేలా ప్రోత్సహించాలి. భావితరాలకు చక్కని వాతావరణాన్ని అంధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

–ఎంబీ చిన్నమ్మ, సైకాలజిస్ట్, రెంటచింతల

మొక్కల పెంపకం బాధ్యతగా భావించాలి



మొక్కలను పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా బావించాలి. ప్రభుత్వం పలు గ్రామాల మధ్యనున్న రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటించి, వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలి. చెట్లను అనుమతులు లేకుండా నరుకుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– అల్లం మర్రెడ్డి, మాజీ సర్పంచ్, రెంటచింతల

పచ్చదనంతోనే ప్రశాంత వాతావరణం



పచ్చదనంతోనే ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది. ప్రజలందరూ ప్రకృతిని ప్రేమించాలి అప్పుడే మొక్కలు చెట్లుగా ఎదుగుతాయి. జీవరాసుల జీవితాల్లో మొక్కల పాత్ర వెల కట్టలేనిది. ప్రకృతిలో లభించే ప్రతి మొక్కల్లో ఓ ఔషద గుణం కలిగి ఉంటుంది. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

– నర్రా కృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్, రెంటచింతల

కోతులు స్వైర విహారం





రెంటచింతలలో గుంపుగా ఉన్న కోతులు (ఇన్‌సెట్‌లో) ఇంటి ముందు సంచరిస్తున్న కోతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కాలనీల్లో కొన్ని రోజులుగా కోతులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ఎగబడి గాయ పరుస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో కొద్ది రోజులగా కోతుల గుంపు ఒకటి మూకుమ్మడిగా ఇళ్ల మధ్య సంచరిస్తూ దాడి చేస్తున్నాయి. ఇటీవల కొందరు ఓ వ్యాన్ ద్వారా అధిక సంఖ్యలో కోతులను కంభంపాడు పెద్ద కాలువ వద్ద విడిచిపోవడంతో ఆ కోతులు సమీప గ్రామాల్లో తిరుగుతున్నాయి. ఫాతిమా నగర్, నాయుడుపేట ఎస్సీ కాలనీ, ఆరోగ్యపురం, రేగుల మా న్యం, పిచుకలగడ్డ తదితర కాలనీల్లో సుమారు సుమారు 20 నుంచి 25 కోతులు వరకు సంచరిస్తున్నాయి. కోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు వాపోయారు. కోతులు ఇళ్లలోకి వచ్చి భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతులు నివాసాలపై ఉన్న వస్తువులను ఎత్తుకుపోవడంతో పాటు గుంపుగా కరవడానికి మీదకు వస్తుండటంతో పిల్ల లే కాకుండా పెద్దలు కూడా భయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, కోతులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసులు పార్టీలకతీతంగా పని చేయాలి



పిడుగురాళ్ల: పోలీసులు పార్టీలకు అతీతంగా పని చేయాలని, బాధితులకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం జూలకల్లు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు నర్రెడ్డి లక్ష్మారెడ్డిపై టీడీపీ గూండాలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. గురజాల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఇటీవల దాడులు చేయడం ఎక్కువైందని మండిపడ్డారు. పొలం పనులకు వెళ్లి వస్తున్న లక్ష్మారెడ్డిని కొందరు టీడీపా నాయకులు కాపు కాచి, కర్రలు, రాడ్డులతో దాడి చేయటం దురదృష్టకరమన్నారు. పోలీసులు ఇలాంటి ఘటనలపై దృష్టిసారించి నిజాలు, నిగ్గు తెల్చి దాడులకు పాల్పడిన వ్యక్తులపై ఏ పార్టీ వారైనా తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు.

ఓరి నీ 'బండ పడా..'



ఓరి నీ బండ ఎవరి మీద్దైనా పడా.. ఏంటి ఇంత నిర్లక్ష్యం. హైవేలో అలర్ట్‌గా లేకపోతే.. హరి అనాల్సిందే. ముందు నుంచి.. వెనుక నుంచి.. లేదా ఇదిగో ఇలా నిర్లక్ష్యంగా వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు నుంచి బండ రూపంలో మృత్యువు మీద పడొచ్చు. ప్రయాదం అనుకుని రాదు.. అనుకోకుండా ప్రాణం తీస్తుంది. అది మన తప్పా..ఎదుటి వారి తప్పా అనేది దానికనవసరం. క్వారీ నుంచి అధిక రాయి లోడుతో.. వస్తున్న ఇలాంటి ట్రాక్టర్లు పోలీసుల అధికారుల కంట పడటం లేదనుకుంటా.. దీని వెనుక వెళ్లే వాహనదారులకు మాత్రం ప్రయాణ గండమే. లేదా ఒకసారి రాయి రోడ్డు మీద పడి..దానిని మరో వాహనం ఢీకొని ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత. పోలీసుల అధికారులు ప్రమాదం జరగక ముందు చర్యలు తీసుకుంటే..ఇలాంటి నిర్లక్ష్యపు ప్రమాదాలను అరికట్టవచ్చు. – పిడుగురాళ

ఆహో..ఏమా ఐకమత్యం



క్రమ శిక్షణంటే వీళ్లదే. ఎంత శ్రద్ధగా ఆటోలో సర్దుకుని ప్రయాణిస్తున్నారో చూడండి. ఆటో వెనుక ముగ్గరు కూర్చుంటే..మరో ఇద్దరిని జాగ్రత్తగా తమ ఒడిలో కూర్చోబెట్టుకుని, గట్టిగా పట్టుకుని ఐకమత్యంగా ప్రయాణిస్తున్నారు. నిజంగా వీరు మహిళా మణులే. కానీ, కూటి కోసం కూలికి వెళ్లే వీరి ప్రయాణం కొంచెం అటుఇటు అయితే.. పరిస్థితి ఏంటీ..? ప్రమాదమని తెలిసినా ఆటో వాలాలు మారడం లేదు. ఇంతకన్నా మార్గం ఆ మహిళా కూలీలకు లేదు. ఏకంగా 20 నుంచి 30 మందిని కుక్కి, కనీసం హ్యాండిల్ తిప్పుకునే వీలు లేనంత ఇరుకుగా డ్రైవర్ ఆటో తోలుతున్నాడు. దీన్ని చూస్తే.. పుష్పక విమానం కూడా సిగ్గు పడుతుందేమో. మరి మన బాధ్యతగల పోలీసులు ఏమి చేస్తున్నారో...? వారు దాడులు చేసినా.. వీరి తీరు మారడం లేదా..? ప్రమాదం జరిగిన తర్వాతే వచ్చి మృతులు, క్షతగాత్రులు ఎంత మందని కేసులు నమోదు చేసి, విచారిస్తారా..? ముందే అప్రమత్తమై వారించి, నివారిస్తారా...!

– పిడుగురాళ్ల

ఉత్సాహంగా చెస్ పోటీలు



మాచర్ల: వాసవి క్లబ్ ప్రపంచంలోని అనేక దేశాల్లో ఏటా సేవా కార్యక్రమాల ద్వారా పేద, మధ్య తరగతి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కోదండ రామాలయంలో ఉచిత మెగా చెస్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, రంగా చెన్నయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెస్ పోటీలు ఆడటం వల్ల మేధా శక్తి పెరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రెటరీ పందిరి నరసింహారావు, ట్రెజరర్ చుండూరు సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్ కుమార్, మాస్టర్ కిరణ్, చెంచిరెడ్డి, యూనివర్సల్ ఫౌండేషన్ ఫౌండర్ ఆవుల అంజి విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



మాచర్ల: విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రస్తుత కాలంలో కంప్యూటర్ ఎంతగానో ఉపయోగపడుతోందని శ్రీ రామకృష్ణ సేవా సమితి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవా శ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తమ సేవా సంస్థ ద్వారా ఏటా ఉచితంగా కంప్యూటర్ శిక్షణనిస్తున్నామన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరముందన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ నాగ సురేష్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి 'పొలం పిలుస్తోంది'

క్రోసూరు: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం, బుధవారం పొలం పిలుస్తోంది గ్రామ సభలు జరుగుతాయని ఏవో వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ, రైతులకు ప్రభుత్వం అందించే పథకాల గురించి వ్యవసాయ అధికారులు వివరిస్తారని తెలిపారు. కావున రైతులు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరుకావాలని కోరారు.

పేదలపై భారం సరికాదు



మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

అమరావతి: రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తగ్గించటం చేతకాని ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపటం సరికాదని సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల సీపీఐ కార్యదర్శి కె.చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసన వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని నమ్మబలికి మోసం చేసారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లు ప్రజలపై భారాన్ని మోపటం దారుణమన్నారు. విద్యుత్ కమిషన్ చెప్పిందన్న సాకుతో విద్యుత్ చార్జీలు పెంచటం తప్పదని చెప్పటం పేదలను మోసం చేయటమేనన్నారు. సరైన దిగుబడి రాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కుమిలిపోతూన్నారన్నారు. పత్తి, మిర్చి, అపరాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న విద్యుత్ మీటర్లు పెట్టే యోచన విరమించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలను ఆదుకోకపోతే వామపక్ష పార్టీలు మరో విద్యుత్ పోరుకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు బైరాపట్నం రామకష్ణ మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం మోపే ఆలోచన విరమించుకోవాలని, ఈ నెల 11న మంత్రి మండలి సమావేశంలో విద్యుత్ చార్జీల విరమణ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జె.యుగంధర్, గోపి, కె.మంత్రాలు, నండూరు జోజి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలి

సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య



ఇంటింటికీ ప్రజాపోరు ప్రచార యాత్రలో కరపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియా, 28వ వార్డు జెండా చెట్టు, నాగన్నకుంట సెంటర్లలో ఆదివారం జరిగిన సీపీఎం ఇంటింటికీ ప్రజా పోరు ప్రచార యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కుటుంబాలు గడవటం కష్టంగా ఉన్న నేపథ్యంలో ఇవి చాలవన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం ప్రజల పక్షాన నిలిచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ప్రజా పోరు ప్రచార కార్యక్రమం చేపట్టిందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటి ప్రజా పోరు ప్రచార యాత్ర చేపట్టి ఈ నెల 14న సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సీపీఎం నాయకులు పాట్టి సూర్యప్రకాశరావు, జడ రాజ్ కుమార్, మునగా జ్యోతి, తుమ్మల లక్ష్మి, ఇంజం అరుణ, చందా ఆంజనేయులు, ఇంజం లింగయ్య, పటాన్ షరీఫ్, షేక్ సైదులు, వనమా రామారావు, ధరణికోట పుల్లారావు, అవ్వారు ప్రసాద్ రావు, పులిపాటి రామారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో రెండు ఆలయాల విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభాల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయం, సీతారాముల ఆలయాలను నిర్మించి, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయాలలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రెండు ఆలయాల ప్రతిష్ట కావడంతో గ్రామంలో మూడు రోజులుగా పండుగ సందడి నెలకొంది. వేద పండితులు హోమ కార్యక్రమాలు నిర్వహించి, పూజలను చేశారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం

బెల్లంకొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం తెలిపారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూ చిట్యాల, మాచాయపాలెం గ్రామాలలో శిబిరాలకు వెళ్లి ఆమె పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాలలో మండల వ్యాప్తంగా చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఫారం–7 దరఖాస్తులు 9, కొత్త ఓట్లు నమోదుకు ఫారం–6 దరఖాస్తులు 12 వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకయ్య, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది ధర్మ, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మీరెక్కడి దొంగలురా..శ్మశానాలనూ వదలరా?

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో తరచూ చోరీలు జరుగుతున్నాయి. అంత్యక్రియలకు హాజరయ్యే వారికి కేటాయించిన గదుల్లోని ఫ్యాన్ల వైరింగ్, ఏసీ బాక్సు వైరింగ్‌లను కట్ చేశారు. దీంతో అంత్యక్రియలు చేసేందుకు వచ్చేవారికి అసౌకర్యం కలుగుతోంది. గత ప్రభుత్వంలో మేజర్ పంచాయతీ గణపవరం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించటంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఇటు పంచాయతీరాజ్ శాఖ నుంచి గానీ, మున్సిపల్ శాఖ నుంచి గానీ గ్రాంట్లు, నిధులు రావటం లేదు. కేవలం ఆస్తిపన్నులు, నీటి చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు మాత్రమే వసూలు అవుతోంది. గ్రామ పంచాయతీకి ఆదాయం తగ్గటంతో పంచాయతీ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇటీవల సమావేశం నిర్వహించారు. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే పలువురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. స్మశాన వాటికలో వాచ్‌మెన్‌గా పనిచేసే వ్యక్తిని తొలగించారు. అప్పటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు స్మశానంలో ప్రవేశిస్తున్నారు. స్మశాన వాటికను ఆనుకుని కొంతభూమి ఉండగా, భూయజమాని కంపచెట్లు నరికి స్మశాన వాటికలో పడేశాడు. దీంతో స్మశానవాటికలోని పైపులైను పగిలిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇలా పలు సమస్యల కారణంగా అంత్యక్రియలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీబాబును వివరణ కోరగా, పైపులైను మరమ్మతులు చేయించామన్నారు. మార్చురీబాక్సు మరమ్మతులు చేయించామన్నారు. ఫ్యాన్ల రిపేర్లు చేయించాలన్నారు. ఆకతాయిలు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.